పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఎస్‌ జమీల్‌ అహ్మద్‌

మోతీనగర్‌: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఎలాంటి వ్యాధులు ధరి చేరవని కూకట్‌పల్లి జోనల్‌ సర్కిల్‌ శానిటరీ సూపర్‌ వైజర్‌ (ఎస్‌ఎస్‌) జమీల్‌ అహ్మద్‌ అన్నారు. బుధవారం స్వచ్ఛభారత్‌ మిషన్‌లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌లోని సులభ్‌ కాంప్లెక్స్‌ వద్ద పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన రోడ్లతో పాటు జన సంచారం ఉన్న ప్రదేశాల్లో కూడా చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన వీధుల్లో చెత్తను తరలించిన వెంటనే రంగవల్లులు, గొబ్బెమ్మలను ఏర్పాటు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించొద్దన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది విధులు, బాధ్యతలపై ఎస్‌ఎస్‌ జమీల్‌ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏలు శివం, నాగేందర్‌, ప్రవీణ్‌, రామ్‌కీ, సిబ్బంది సతీష్‌, బందీ పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్‌వైర్ల పరిశీలన



ఏఈ భీమయ్యతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ సతీష్‌గౌడ్‌

మూసాపేట: ఫతేనగర్‌ డివిజన్‌ పరిధిలోని భరత్‌ నగర్‌ కాలనీ ఎస్సీ నగర్‌లో కిందకు వేలాడుతున్న విద్యుత్‌ వైర్లను కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్‌ బుధవారం పరిశీలించారు. విద్యుత్‌ స్తంభాల వైర్లు కిందకు వేలాడుతుండటంతో చిన్నపాటి గాలి వచ్చినా, వర్షం వచ్చినా విద్యుదాఘాతంతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించి పరిశీలించారు. వేలాడుతున్న వైర్ల స్థానంలో కేబుల్‌ను వేయాలని ఏఈకి సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ నగర్‌ అధ్యక్షురాలు జ్యోతి గౌడ్‌, రాములు గుప్తా, సంతోష్‌ గుప్తా, అంజయ్య, సాగర్‌, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్‌ గుర్తింపు కార్డుల పంపిణీ



ఆల్విన్‌కాలనీ: పీఆర్‌టీయూ టీఎస్‌ మండల శాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు బుధవారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. యూనియన్‌ గుర్తింపు కార్డులను సభ్యులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్‌ సెక్రటరీ విఠల్‌, హెచ్‌ఎం నరేందర్‌ రెడ్డి, చంద్రశేఖర్‌, లక్ష్మి, వీరేందర్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుర మహిళలకు చేయూత

ఆర్థిక స్వావలంబనకు రూ.51 కోట్లు

- మహిళా శక్తి కింద గ్రూపు, వ్యక్తిగత రుణాల పంపిణీ
- కుటీర, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థిక బలోపేతమే లక్ష్యం
- 13 పురపాలక సంఘాల్లో 7,245 మహిళా సంఘాలు



సాక్షి,సిటీబ్యూరో: పురపాలక సంఘాల్లోని పేద మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో ఇందిరా మహిళా శక్తి పథకం కింద పేద మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా వివిధ ఉపాధి సంస్థలు, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.51 కోట్లు ఆర్థిక సాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జిల్లాలోని పీర్జాదిగూడ, బోడుప్పల్‌, నిజాంపేట, జవహర్‌నగర్‌, కొంపెల్లి, దుండిగల్‌, మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్కేసర్‌, పోచారం పురపాలక సంఘాల్లో 7,245 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల్లోని మహిళలకు ఉపాధి కల్పించేందుకు గాను రూ.51 కోట్లు ఆర్థిక సాయాన్ని అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో 13 పురపాలక సంఘాల పరిధిలోని 130 గ్రూపులకు ఉపాధి కల్పనలో భాగంగా రూ.26 కోట్లు వెచ్చిస్తారు. వ్యక్తిగతంగా నిరుపేద మహిళలు చిన్న తరహా ఉపాధి సంస్థల ఏర్పాటుకు సంబంధించి 900 మందికి రూ.25 కోట్లు అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం లబ్ధిదారులను గుర్తించే పనిలో నిమగ్నమైంది.

ఉపాధి సంస్థలివీ..

గ్రూపు సంస్థల్లో క్యాంటీన్లు, మీ సేవా కేంద్రం, ఈవెంట్‌ మేనేజ్మెంట్‌, స్ట్రీట్‌ వెండర్‌ కలెక్టివ్స్‌/ కోల్డ్‌ స్టోరేజీ యూనిట్లు, క్యాటరింగ్‌ సర్వీస్‌, ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ తదితరాలు ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో కూరగాయలు, పండ్ల దుకాణాలు, బేకరీ, డెయిరీ, డెయిరీ ప్రొడక్ట్స్‌, మైక్‌ సెట్స్‌, సౌండ్‌సెట్స్‌, బ్యూటీ వెల్‌నెస్‌ సెంటర్లు, టెంట్‌ హౌస్‌, ఫ్యాన్సీ స్టోర్‌, కిరాణ జనరల్‌ స్టోర్‌, ఫుడ్‌కు సంబంధించిన దుకాణాలు ఉన్నాయి.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవాలు

కుత్బుల్లాపూర్‌: చింతల్‌ ద్వారకాపురి కాలనీలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయ స్వామి సహిత వాయులింగ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం స్థాపిత పూజలు, శ్రీసుబ్రహ్మణ్యస్వామి మూల మంత్ర హవనం, సాయంత్రం 4 గంటలకు శయ్యాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 7.30 గంటలకు స్థాపిక దేవతలకు పూజలు, 9.15 గంటలకు యంత్రపూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త కామాక్షి శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపారు. హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి భారతీ మహాస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిష్ఠాపన చేయనున్నారని పేర్కొన్నారు.



కలశ పూజలో పాల్గొన్న వేద పండితులు

సౌత్‌జోన్‌ మహిళల వాలీబాల్‌ జట్టు ఎంపిక



మహిళా జట్టు ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో సౌత్‌ జోన్‌ వాలీబాల్‌ ఇంటర్‌ యూనివర్సిటీ మహిళా జట్టును బుధవారం ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ ప్రొఫెసర్‌ దిలీప్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నల్లగొండ అశోక్‌ ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడులోని జెప్పియర్‌ యూనివర్సిటీలో జనవరి 7 నుంచి 11 వరకు జరిగే సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ వాలీబాల్‌ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

వ్యభిచారుల రిమాండ్‌

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్‌ పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి సుమారు 8 మంది వ్యభిచారులను పోలీసులు అరెస్టు చేసి బైండోవర్‌ చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మెట్రో స్టేషన్‌ వద్ద 10 టీంలు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల 8 మంది వ్యభిచారులను అరెస్టు చేసి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేశారు. వ్యభిచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. ప్రతి నెలా తప్పకుండా స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించి వ్యభిచారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



చౌడేశ్వరి మాత ప్రతిష్ఠలో ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌లోని బాగ్‌ అమీర్‌లో చౌడేశ్వరి మాతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో బుధవారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. మూసాపేట యాదవబస్తీలోని పంచశీల స్కూల్‌లో కార్పొరేటర్‌ మహేందర్‌, చిత్తారమ్మ తల్లి ఆలయం సమీపంలోని స్కూల్‌లో మాజీ కార్పొరేటర్‌ బాబూరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సుమారు 2 వేల మంది విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్‌ ఫెలోషిప్‌ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న శ్రీరామోజు శివకుమార్‌

ఆల్విన్‌కాలనీ: భారతీయ దళిత్‌ సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్‌ ఫెలోషిప్‌ అవార్డును ప్రగతినగర్‌కు చెందిన శ్రీరామోజు శివకుమార్‌ బుధవారం అందుకున్నారు. శివకుమార్‌ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి 20 ఏళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పురోగతికి పాటుపడుతున్నారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. అతను ఒక ప్రైవేట్‌ కంపెనీలో పనిచేస్తూ నెలసరి జీతంతో ఆర్థికసాయం తదితర సేవలతో ఆయనకు గుర్తింపు వచ్చింది. అవార్డు రావడం పట్ల శివకుమార్‌ హర్షం వ్యక్తం చేశారు.

అధికారంలోకి రాగానే.. కాంగ్రెస్‌ తల్లిని గాంధీ భవన్‌కు పంపిస్తాం

- బతుకమ్మను తొలగించడం సరికాదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌ శిరీష తదితరులు

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌ తల్లిని గాంధీ భవన్‌కు పంపిస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్‌ శిరీష బాబురావు, రాగిడి లక్ష్మారెడ్డిలతో కలిసి బుధవారం కేపీహెచ్‌బీ మెయిన్‌ రోడ్డులోని ఆటోస్టాండ్‌ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం 1969 నుంచి తెలంగాణకు వెన్నుపోటు పొడిచిందన్నారు. శ్రీకాంతాచారి, యాదగిరి రెడ్డి లాంటి ఎందరో అమర వీరుల త్యాగాలు, కేసీఆర్‌ దీక్ష, ఉద్యమకారుల పోరాటం వల్లే రాష్ట్రాన్ని సాధించామని గుర్తు చేశారు. తెలంగాణ అంటే బతుకమ్మ అని, అలాంటి బతుకమ్మను తొలగించడం దారుణమన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం కేసీఆర్‌ చేసిన కార్యక్రమాలకు పేర్లు మార్చడమే తప్పా ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేయటంలో గుండు సున్నా పెట్టారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌ గౌడ్‌, రాజేష్‌, సురేష్‌ రెడ్డి, పవన్‌, నాగరాజు, సాయి, లక్ష్మి, రాజు, భవాని, భారతి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్‌ వార్డు కార్యాలయం వద్ద..

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ వివేకానందనగర్‌ వార్డు కార్యాలయం వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి కార్పొరేటర్‌ సబిహా బేగం, మైనార్టీ సెల్‌ జిల్లా అధ్యక్షులు మహ్మద్‌ గౌసుద్దీన్‌ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. బతుకమ్మను తెలంగాణ తల్లి చేతి నుంచి తొలగించి సంస్కృతిపై దాడి చేశారని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్‌ కో ఆర్డినేటర్‌ వీరారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు పార్వతమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ మార్పు సరికాదు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: కార్పొరేటర్‌ ముద్దం నరసింహ యాదవ్‌ ఆధ్వర్యంలో బుధవారం జయశంకర్‌ నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం విగ్రహ మార్పు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మార్చాల్సింది విగ్రహాలను కాదని, ప్రజల జీవన విధానాలను అని అన్నారు. కార్యక్రమంలో రిటైల్‌ కూరగాయల మార్కెట్‌ చైర్మన్‌ సత్యనారాయణ, డివిజన్‌ ప్రధాన కార్యదర్శి హరినాథ్‌, మైనారిటీ అధ్యక్షుడు మేరాజ్‌, కాలనీ సభ్యులు ఫిరోజ్‌, చందు, యాదగిరి, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, వాణి పాల్గొన్నారు.

బాలానగర్‌ డివిజన్‌లో..

బాలానగర్‌: కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి, ఫతేనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌ శోభనా బస్టాప్‌ సెంటర్‌ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చాక విగ్రహాలు మార్చటం తప్ప.. పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కంచి భిక్షపతి, కుతాడి రాములు, సుదర్శన్‌ రెడ్డి, జగదీష్‌, నగేష్‌, అఫ్జల్‌, కన్నయ్య పాల్గొన్నారు.



వివేకానందనగర్‌లో.. కార్పొరేటర్‌ సబిహా బేగం



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్‌ నరసింహయాదవ్‌ తదితరులు



క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్‌ సతీష్‌ గౌడ్‌ తదితరులు



మాట్లాడుతున్న బాలానగర్‌ కార్పొరేటర్‌ రవీందర్‌ రెడ్డి

మానవ హక్కుల సంఘం రాష్ట్ర వైస్‌ చైర్మన్‌గా మున్నా

మోతీనగర్‌: మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర వైస్‌ చైర్మన్‌గా ఎండీ జహంగీర్‌ అలియాస్‌ మున్నా బుధవారం నియమితులయ్యారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జాతీయ వైస్‌ చైర్మన్‌ ముస్తఫా అలీ అతడిని నియమించారు. 16 సంవత్సరాలుగా సామాజిక సేవలో చురుకుగా ఉన్నారు. మరింత బాధ్యతతో ముందుకెళ్తానని మున్నా అన్నారు.

కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికుడి మృతి



సుధాకర్‌ (ఫైల్‌)

మూసాపేట: కారు ఢీకొట్టడంతో ఓ పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చిట్యాల గ్రామం, పెద్ద వంగర మండలం, మహబూబాబాద్‌కు చెందిన ఈదురు సుధాకర్‌ (30) జగద్గిరిగుట్టలోని సోమయ్య నగర్‌లో నివసిస్తున్నాడు. కూకట్‌పల్లి మున్సిపల్‌ కార్యాలయంలో 8 సంవత్సరాలుగా స్వీపర్‌గా పని చేస్తున్నాడు. రోజూలాగే ఉదయం సుధాకర్‌ తన బైక్‌పై విధులకు వెళ్తున్నాడు. ఐడీఎల్‌ చెరువు కట్టపై రోడ్డు పక్కకు బైక్‌ నిలిపాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైకును ఢీకొట్టడంతో సుధాకర్‌ కిందపడ్డాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పారిశుద్ధ్య కార్మికులు, మృతుడి బంధువులు తమకు న్యాయం చేయాలని పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసుల హామీతో ధర్నాను విరమించారు.

16 నుంచి సీఎం కప్‌ జిల్లా స్థాయి క్రీడలు

- 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు
- జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి 19 వరకు సీఎం కప్‌ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు తెలిపారు. 16న హకీంపేట్‌ తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూల్‌లో యోగా, చెస్‌, జూడో, హ్యాండ్‌బాల్‌ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. కీసర ఓఆర్‌ఆర్‌ ప్రాంతంలో సైక్లింగ్‌,, లాలాగూడలో బాక్సింగ్‌ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17న హకీంపేట్‌ తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూల్‌లో ఖోఖో, వాలీబాల్‌, ఫుట్‌బాల్‌ సెలక్షన్లు ఉంటాయన్నారు. ఓల్డ్‌ అల్వాల్‌లో స్విమ్మింగ్‌ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయన్నారు. 18న కబడ్డీ, అథ్లెటిక్స్‌, ఉప్పల్‌ భగాయత్‌లో బ్యాడ్మింటన్‌ జట్ల ఎంపిక ఉంటుందన్నారు. ఉప్పల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో కిక్‌ బాక్సింగ్‌, అల్వాల్‌ పల్లవి స్కూల్‌లో నెట్‌ బాల్‌ సెలక్షన్లు నిర్వహిస్తారన్నారు. 19న జింఖానా గ్రౌండ్‌లో బాస్కెట్‌ బాల్‌ సెలక్షన్లు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్‌ సర్టిఫికెట్లతోపాటు పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్‌ సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రం, 10వ తరగతి మెమో, 2 పాస్‌ ఫోర్ట్‌ ఫొటోలు, ఆధార్‌ కార్డుతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9912770801, 7660919518 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మనూలో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: హిందీ, ఉర్దూ భాషలు, సంగీతానికి అమీర్‌ ఖుస్రూ చేసిన కృషి మరువలేనిదని కెనడాలోని టొరంటో నోబెల్‌ ఇంటర్నేషనల్‌ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ రతన్‌ లాల్‌ హంగ్లూ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం, కల్చర్‌ హౌస్‌ ఆఫ్‌ ది ఇస్లామిక్‌ రిపబ్లిక్‌ ఆఫ్‌ ఇరాన్‌ ముంబై సంయుక్తంగా 'అమీర్‌ ఖుస్రూ: యాన్‌ ఐకాన్‌ ఆఫ్‌ ది కాంపోజిట్‌ కల్చర్‌ ఆఫ్‌ ఇండియా' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీర్‌ ఖుస్రూ భారతీయ చరిత్రపై చేసిన కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్‌ వేడుకలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి పాస్టర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్‌ వేడుకలను కూకట్‌పల్లి డివిజన్‌లోని అశోక్‌ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌ గౌడ్‌ హాజరై కేక్‌కట్‌ చేశారు. క్రిస్మస్‌ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, చంద్రారెడ్డి, పాస్టర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ ఎడ్వర్డ్‌ రోస్‌, కమిటీ సభ్యులు యేసు రాజు, కొమ్ము సాగర్‌, సీహెచ్‌.మాణిక్యం, ఆనంద్‌ ప్రసాద్‌, జార్జ్‌, జైపాల్‌ సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది బుధవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపట్టారు. నిరవధిక సమ్మెలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న సమగ్ర శిక్షా సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. విద్యాశాఖలో జిల్లా స్థాయిలో ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు పని చేస్తుండగా, మండల స్థాయిలో కంప్యూటర్‌ సహాయకులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలను అందించే భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు, రిసోర్స్‌ పర్సన్లు పని చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో ఆర్ట్‌, క్రాఫ్ట్‌, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ఏఎన్‌ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్‌ సహాయకులు, వంట పనివారు, వాచ్‌మెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు సమ్మెలోకి వెళ్లటంతో విద్యాశాఖపై తీవ్ర ప్రభావం పడుతోంది. సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, ఇప్పటివరకు పేస్కేల్‌ కల్పించాలని ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు జగదీశ్వర్‌, ఫణి తదితరులు పాల్గొన్నారు.